## కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యాదయ్య



**షాబాద్, రాజముద్ర న్యూస్:** షాబాద్ మండలానికి చెందిన 26 మంది కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన చేవెళ్ల శాసన సభ్యులు కాలె యాదయ్య. ఈ సందర్భంగా మండలానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.26,00,416 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఉద్యమ కారుల ఫోరం మండల అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డికి సన్మానం



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం చేవెళ్ల మండల అధ్యక్షులుగా నియమితులైన ఎన్ను గోవర్ధన్ రెడ్డిని పలువురు శాలువాతో సన్మించారు. ఉద్యమకారుల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అయనను ఘనంగా సన్మానించి అభినదించారు. గోవర్ధన్ రెడ్డిని సన్మానించిన వారిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్యాంపేయినింగ్ కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం, జీవ్వానోళ్ల మల్లేష్, ఎన్ను శివ శంకర్ రెడ్డి, బీరపోల్లా మాణికుమార్ జెగళ్ళ నర్సిములు, సీనియర్ జర్నలిస్టు ప్రజా హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షులు కడమంచి ఆనంద్, మైనారిటీ నాయకులు సాధిక్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా కార్యదర్శికి న్యాయవాదుల అభినందనలు



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** ఇటీవల బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన గౌండ్ల కృష్ణ గౌడ్‌ను చేవెళ్ల న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....గౌండ్ల కృష్ణ గౌడ్ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ద్రోణవల్లి సతీష్



**బీర్కూర్, రాజముద్ర న్యూస్:** బీర్కూర్ మండలంలోని ప్రజలకు మాజీ జెడ్పిటిసి సభ్యులు హృదయపూర్వకంగా 2026 ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి, సంపదలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉగాది కొత్త ఆరంభాలకు ప్రతీక అని, ఈ పండుగ మన సంప్రదాయాలను, సంస్కృతిని గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆనందంగా జరుపుకునే ఈ పర్వదినం ప్రతి ఇంట్లో ఐక్యతను పెంపొందిస్తుందని అన్నారు. అలాగే కొత్త సంవత్సరంలో రైతులు, కార్మికులు, విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు. ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని, ప్రతి ఇంట్లో సుభిక్షం నెలకొనాలని ఆశించారు. ఈ సందర్భంగా మండల ప్రజలందరికీ ఉగాది పచ్చడి ప్రత్యేకతను గుర్తు చేస్తూ, జీవితంలోని అన్ని రుచులను సమానంగా స్వీకరించాలని సూచించారు. "శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది మీ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి" అని ఆకాంక్షిస్తూ మరోసారి అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

## సిల్వర్ డేల్ పాఠశాలలో అగ్నిమాపక అవగాహన కార్యక్రమం






**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సిల్వర్ డేల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో స్థానిక ఫైర్ స్టేషన్ బృందం , అగ్నిమాపక అవగాహన సదస్సు నిర్వహించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఫైర్ ఫైట్స్ గోపాల్, ప్రశాంత్, హెడ్ కానిస్టేబుల్ దస్తగిరి విద్యార్థులకు అగ్ని ప్రమాదాల కారణాలు, వాటిని నివారించే పద్ధతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రాక్టికల్ గా చూయించారు. విద్యార్థుల సమక్షంలో మన చుట్టూ ఉన్న పరిసరాలలో గల భవనాలు, పాఠశాల ప్రాంగణాలు, ఆసుపత్రులు, రద్దీ ప్రదేశాలలో అగ్ని ప్రమాదాలు జరగకుండా పాటించవలసిన మెలకువలను వివరించారు. పాఠ్యపుస్తకాలలోని విజ్ఞాన శాస్త్రంను అనుసంధానం చేస్తూ...అగ్ని ప్రమాదాలను సులువైన పద్ధతిలో ఎలా నివారించాలి, చికిత్స పద్ధతులు, మొదలైన వాటిని చక్కటి పద్ధతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యొక్క రెస్పాండెంట్ మోహన్ చారి, ప్రిన్సిపల్స్ సునీత రెడ్డి, చేవెళ్ల అగ్నిమాపక బృందం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్త ఆశల ఆరంభం ఉగాది పండుగ వైభవం

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** ఉగాది తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అతి ముఖ్యమైన పండుగ. "యుగాది" అనే పదం నుంచి ఉద్భవించిన ఈ పేరు "కొత్త యుగానికి ఆరంభం" అనే అర్థాన్ని సూచిస్తుంది. ప్రతి సంవత్సరం చైత్ర మాస శుద్ధ పాడ్యమి నాడు ఉగాది పండుగను ఘనంగా జరుపుకుంటారు. 2026లో ఈ పండుగ మార్చి 19న జరగనుంది. ఉగాది రోజు ఉదయం లేవగానే ఇళ్లను శుభ్రపరచి, మామిడి ఆకులతో తోరణాలు కట్టి, రంగవల్లులు వేసి ఇంటిని అందంగా అలంకరిస్తారు. కొత్త బట్టలు ధరించి దేవునికి పూజలు చేసి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. ఈ రోజు ప్రత్యేకంగా తయారు చేసే "ఉగాది పచ్చడి"కి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇందులో వేపపువ్వులు, బెల్లం, మామిడి, చింతపండు, మిరప, ఉప్పు కలిపి తయారు చేస్తారు. ఇది జీవితం లోని ఆరు రుచులను సూచిస్తూ సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాలని చెప్పే గొప్ప సందేశాన్ని ఇస్తుంది.ఉగాది పండుగలో మరో ముఖ్యమైన భాగం పంచాంగ శ్రవణం. పండితులు కొత్త సంవత్సరానికి సంబంధించిన ఫలితాలను వివరించి ప్రజలకు మార్గదర్శనం చేస్తారు.




వ్యవసాయం, వర్షపాతం, ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలపై ముందస్తు అవగాహన కల్పిస్తారు. ఉగాది పండుగ మనకు కొత్త ఆశలు, కొత్త సంకల్పాలు, కొత్త ప్రారంభాలను గుర్తు చేస్తుంది. కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి ఆనందంగా జరుపుకోవడం ద్వారా అనుబంధాలు మరింత బలపడతాయి. ఈ పండుగ మన సంస్కృతికి అద్దం పట్టే శుభదినంగా ఎప్పటికీ నిలిచిపోతుంది.

## బాధిత కుటుంబానికి అండగా శశికాంత్



**బీర్కూర్, రాజముద్ర న్యూస్:** బీర్కూర్ మండలంలోని అన్నారం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు మియాపురం శశికాంత్ పరామర్శించారు. ప్రమాదంలో ఇంటితో పాటు గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమవడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఈ విషయం తెలుసుకున్న శశికాంత్ గ్రామానికి చేరుకుని బాధితులను ధైర్యం చెప్పారు. తక్షణ అవసరాల నిమిత్తం 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులోనూ అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో బాధితులకు చేయూతనివ్వడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఆయన సేవలను అభినందించారు. అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి కూడా సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే శ్రీనివాస్ 5000 రూపాయలు, ప్రతాపరెడ్డి 2000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచిన 6 గ్యారంటీలను 420 హామీలను వెంటనే అమలుచేయాలి

### నవాబుపేట్ తాసిల్దార్ కార్యాలయం ముందు బీజేపీ నాయకుల నిరసన



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మెరకు బుధవారం వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు బిజెపి మండల నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ మండల నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి గత 2 సంవత్సరాల నుండి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మోసపూరిత హామీలు అమలు చేయకపోగా ప్రజలను మోసం చేస్తూ వస్తున్నారని, రాష్ట్రంలో ఎలాంటి అభివృధి చేయకపోగా అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమే జరుగుతుందన్నరు, ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని స్థానిక నాయకులు కూడా ప్రజా క్షేత్రంలో ఉండకుండా విలాసవంతమైన రాజకీయ జీవితానికి అలవాటు పడ్డారని మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు ప్రధాన రహదారి ఎన్నో రోజుల నుంచి ఇబ్బందికరంగా ఉందని కేవలం కమిషన్ల కోసమే రోడ్డు పనులు ప్రారంభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

హైడ్రా పేరుతో మూసి ప్రక్షాళన పేరుతో కేవలం పేద ప్రజల ఇండ్లను కూల్చి వారిని రోడ్డున పడేసి పేద ప్రజలను మాత్రమే ఇబ్బంది పెడుతున్నారు. బఫర్ జోన్ లో కట్టిన ఓవైసీ కాలేజ్ ని ఇప్పటివరకు ఎందుకు హైడ్రా ముట్టుకోలేదని ప్రశ్నించారు. ఈ విషయమై నవాబుపేట్ తహసిల్దార్ కు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలం అధ్యక్షులు చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఉప అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి జగన్, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, రవి, లక్ష్మణ్, మణికంఠ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సిములు, విజయ్, శివ, బూత్ అధ్యక్షులు మాణిక్యం, దుర్గయ్య, నర్సింహా చారి, శ్రీకాంత్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికీ పూర్తి సహకారం అందిస్తాం

### వికారాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం అనన్య



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** బుధవారం వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏఎంసీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన పాలకవర్గ రెండవ సమావేశం మార్కెట్ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా, పాలక మండలి సభ్యురాలు వికారాబాద్ మునిసిపల్ చైర్పర్సన్ గడ్డం అనన్య హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వికారాబాద్ రైతు బజార్ కు సంబంధించిన అభివృద్ధి విషయంపై అక్కడ నెలకొన్న సమస్యలపై చర్చించడం జరిగింది. మున్సిపల్ వారి ఆధీనంలో ఉన్న రైతు బజార్ కు నిధులు కేటాయించి రైతులకు ఎటువంటి సమస్య లేకుండా చూస్తానని మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం. అనన్య హామీ ఇవ్వడం జరిగింది. వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించిన అభివృద్ధికొరకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలంగాణ శాసనసభ సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ సహాయ సహకారంతో త్వరలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తామని ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ను, వైస్ చైర్మన్ ను ఏఎంసి పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ మల్లేశం, వికారాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిళ్లపాటి. రాజశేఖర్ రెడ్డి, ఏఎంసి సెక్రటరీ ఫాసియొద్దీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు సిబ్బంది పాల్గొన్నారు.



# మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- రంజాన్ను సంతోషంగా జరుపుకోవాలి
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**రాజముద్ర న్యూస్ , కరీంనగర్ :** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని, రంజాన్ పండుగను ముస్లిం సోదరులు సంతోషంగా జరుపుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం మధురానగర్లోని ఓ ఫంక్షన్ హాల్లో చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ముస్లింలకు రంజాన్ తోఫాను సీపీ గౌష్ ఆలంతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన ముస్లింలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పండుగలకు ప్రత్యేక గుర్తింపునిస్తోందని, రాష్ట్రంలోని ముస్లిలందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ముస్లింలకు రంజాన్ తోఫాను ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రంలో ముందస్తు ఉగాది వేడుకలు



- సంప్రదాయబద్ధంగా ఉగాది పచ్చడి పంపిణీ
- కలిసి పాల్గొన్న సర్పంచ్ నూనె రమ

**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** మండలంలోని కన్నాపూర్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఉగాది వేడుకలు ముందస్తుగా అత్యంత వేడుకగా జరిగాయి. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నూనె రమ, ఉప సర్పంచ్ అశోక్ ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తెలుగు వారి తొలి పండుగ ఉగాది అని, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలోని కష్టసుఖాలకు ప్రతీక అని పేర్కొన్నారు. రాబోయే క్రోధి నామ సంవత్సరం (లేదా పరాభవ నామ సంవత్సరం) అందరి జీవితాల్లో సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, అంగన్వాడీ టీచర్ కాటం రాజమణి ఆయా, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. చిన్నారులకు పండుగ విశిష్టతను వివరిస్తూ స్వీట్లు పంపిణీ చేశారు.



# ఇందిరమ్మ ఇళ్ల రుణాలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలి

- నిజమైన లబ్ధిదారులకు రుణాలు అందేలా చూడాలి
- ఒక ప్రణాళిక ప్రకారమే రుణాలు ఇవ్వాలంటున్న నవాబుపేట్ మండల ఆయా గ్రామాల ప్రజలు

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవారికి సొంత గృహం కలిగి ఉండాలని లక్ష్యంతో ముందుకు వెళుతున్న తరుణంలో ఇల్లు కూడా కట్టలేని స్థితిలో ఉన్నవారికి ఐకెపి నుండి రుణాలు ఇచ్చి ఇల్లు నిర్మించే విధంగా ప్రభుత్వం అందిస్తున్న ఈ రుణాలు నిజమైన లబ్ధిదారులకు చేకూరాలని నవాబుపేట్ మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం... ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇల్లు నిర్మాణం కోసం స్థలం ఉండి కూడా ఇల్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్నవారికి ఐకెపి నుండి రుణాలు మంజూరు నిజమైన లబ్ధిదారులకే చేయాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న రుణాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కూడా ఉండాలని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న రుణం ఇల్లు నిర్మించుకునేందుకు ఆ రుణాన్ని ఉపయోగించుకునే విధంగా సంబంధిత అధికారులే చూడాలని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా ఇచ్చే రుణాలు నవాబుపేట్ మండల పరిధిలో ఇప్పటివరకు ఎంతమందికి రుణాలు ఇచ్చారు...? ఎంతమంది ఇల్లు నిర్మించుకున్నారు...? ఇల్లు నిర్మించలేనివారు ఎంతమంది ఉన్నారో వీరందరి పైన సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. నవాబుపేట్ మండల పరిధిలోనే కాకుండా జిల్లాలో కూడా ఎక్కడ జరగకుండా అవకతవకలు జరగకుండా సంబంధిత అధికారులు చూడాలన్నారు.

# గొల్లపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం



**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలంలోని గొల్లపల్లి గ్రామంలో 89 పాడి పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు వేయడం జరిగిందని మండల పశువైద్యాధికారి డాక్టర్ రామ్ చందర్ తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిషన్ యాదవ్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు, ఉపసర్పంచ్, పశు వైద్య సిబ్బంది ఎం ఎస్ రావు వి ఎల్ ఓ, నారాయణ జె వి ఓ , ఇతర సిబ్బంది మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

# మసీదుకు వంట సామాగ్రి అందజేత



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** మండలంలోని కరీంపేట గ్రామంలో మాజీ సర్పంచ్ వనపర్తి మల్లయ్య తన తల్లిదండ్రులు వనపర్తి మల్లమ్మ, రాజయ్య జ్ఞాపకార్థంగా మసీదుకు వంట సామాగ్రి అందజేశారు. మసీదుల్లో ఇఫ్తార్ విందులు, సామూహిక వంటల కోసం అవసరమైన పెద్ద పాత్రలు, గరిటెలు సమకూర్చడం ద్వారా మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ రంజాన్ వంటి పండుగల సమయంలో మసీదుల వద్ద ఏర్పాటు చేసే వంట కార్యక్రమాలు ముస్లింల ఐక్యతను బలోపేతం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీలత-రమేష్, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య గౌడ్, మాజీ ఉపసర్పంచ్ చింతం కుమారస్వామి, ప్రజా ప్రతినిధులు అశోక్, అనిల్, హరీశ్, ప్రసాద్, దామోదర్, దాశి, రాజయ్య, మల్లేశం, తిరుపతి, భూమయ్య, స్వామి, శంకరయ్య, భిక్షపతి పాల్గొన్నారు. గ్రామ ముస్లింలు కూడా హాజరయ్యారు.

# మోడల్ స్కూల్లో ఘనంగా ఉగాది, రంజాన్ వేడుకలు



- సర్వమత సౌహార్దానికి ప్రతీకగా వేడుకలు: ప్రిన్సిపాల్ కె. ప్రభాకర్
- విద్యార్థుల మధ్య వెల్లివిరిసిన పండుగ సందడి

**రాజముద్ర న్యూస్,శంకరపట్నం:** స్థానిక మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ముందస్తు వేడుకలు అత్యంత వేడుకగా జరిగాయి. పాఠశాల విద్యార్థులు ఉగాది పచ్చడిని, రంజాన్ ప్రత్యేక డ్రై ఫ్రూట్స్ను పరస్పరం పంచుకుంటూ ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కే ప్రభాకర్ మాట్లాడుతూ.. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి నిలయమని కొనియాడారు. విద్యార్థులు చిన్నతనం నుండే పరమత సహనాన్ని, సామాజిక గౌరవాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కొత్త సంవత్సరంలో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ సందడిని పంచుకున్నారు

# రాజాపూర్లో కొబ్బరి చెట్టుపై పిడుగు పాటు



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** మండలంలోని రాజాపూర్ గ్రామంలో తాడిచెట్టుపై పిడుగు పడిన సంఘటన చోటుచేసుకుంది. బుధవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున ఒక్కసారిగా వినిపించిన భారీ శబ్దంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. పిడుగు పడడంతో కొబ్బరి చెట్టుపై భాగం పూర్తిగా దెబ్బతిన్నట్లు చింతి రెడ్డి రాజిరెడ్డి తెలిపాడు. సంఘటన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఏర్పాటు



**రాజముద్ర న్యూస్ ,శంకరపట్నం:** తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గజ్జల కాంతం ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు క్యాదాసి ప్రభాకర్ మండలానికి కొత్త కమిటీ ఏర్పాటుకు ఈ నెల 24వ తేదీన కేశవపట్నంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, యువకులు, అంబేద్కర్ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బొజ్జ రవి, మైసాని మనోహర్, ఉపాధ్యక్షులు తప్పట్ల అంజయ్య, జిల్లా అధికార ప్రతినిధి గడ్డం నాగరాజు అంతడుపుల సతీష్, కనకం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు





**అన్ని మతాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ: బత్తిని శ్రీనివాస్ గౌడ్**

**రాజముద్ర న్యూస్,శంకరపట్నం:** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శంకరపట్నం మండల కేంద్రంలో ముస్లిం సోదరులకు బుధవారం ఇఫ్తార్ విందును ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అన్ని మతాల సంక్షేమానికి, సౌభ్రాతృత్వానికి కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. రంజాన్ మాస పవిత్రతను చాటుతూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సురేఖ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొపగోని బస్వయ్య గౌడ్, నాంపల్లి తిరుపతి, ఉప్పుగళ్ల మల్లారెడ్డి, దుర్గపు తిరుపతి పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. మత సామరస్యానికి ప్రతీకగా సాగిన ఈ వేడుకలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మత గురువులు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

